పేదరిక నిర్మూలనే సీఎం జగన్ ధ్యేయం



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

వంగర: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గురువారం మండలంలోని తలగాం గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న వారికి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు వారి దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని వారు సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, కోవిడ్ కష్టకాలంలో కూడా ఏ ఒక్క పథకం అమలు ఆగలేదన్నారు. ఇదే ప్రభుత్వ పాలనలో చిత్తశుద్ధికి నిదర్శమన్నారు. అలాగే ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతీ వర్గానికి మేలు జరిగేలా ప్రభుత్వ పథకాలు రూపొందించి, అందివ్వడం జరుగుతోందన్నారు. మరోవైపు సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారం జరుగుతోందన్నారు. అన్ని వర్గాల ప్రజలు సీఎం జగన్ వెంటే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీదే గెలుపు అని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.రాధమ్మ, ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కె.సుదర్శనరావు, వైస్ ఎంపీపీ కె.ఉమామహేశ్వరరావు, పార్టీ నాయకులు కె.సన్యాసినాయుడు, జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు సరసనాపల్లిల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రేగిడి: మండలంలోని సరసనాపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహన్‌రావు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొంటారని, మండల స్థాయి పార్టీ నేతలు, కార్యకర్తలు, అధికారులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

'గాడిచర్ల'కు ఘననివాళి

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో స్వాతంత్య్ర సమరయోధుడు, గ్రంథాలయోద్యమ నాయకుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు 140వ జయంతి గురువారం నిర్వహించారు. లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి, విద్యార్థులు, పాఠకులు గాడిచర్ల చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘననివాళులర్పించారు. దేశానికి స్వాతంత్య్రం తీసుకురావడంలో గ్రంథాలయాల స్థాపనలో ఆయన కృషిని కొనియాడారు.

పట్టుదలతోనే విజయం సొంతం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మోటివేషనల్ ట్రైనీ శ్రీదేవి

రాజాం: పట్టుదలతోనే పరీక్షల్లో విజయం సొంతమవుతుందని, ప్రతీ విద్యార్థి తమ చదువులో పట్టుదలను కనబరచాలని సారధి వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ మోటివేషనల్ ట్రైనీ పొట్టా శ్రీదేవి తెలిపారు. రాజాం, కంచరాం గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు మోటివేషన్ తరగతులు గురువారం నిర్వహించగా, పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన ఆమె పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలంటే ఏకాగ్రత, క్రమశిక్షణ, కఠోర శ్రమ అవసరమన్నారు. ఎనిమిదో తరగతి నుంచే మనం ఏం కావాలనుకుంటున్నామో అన్నదానిపై లక్ష్యం ఏర్పర్చుకోవాలన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

తెర్లాం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ ఆర్.రమేష్ అన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన ఈ నెల 18వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని, ప్రైవేటు స్థలాల్లో మాత్రమే విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని, రోడ్లకు అడ్డంగా విగ్రహాలను ఏర్పాటు చేయవద్దని సూచించారు. ఉత్సవాల్లో కూడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు ముందుగా డిక్లరేషన్ రాసి, సంతకాలు చేసి ఇవ్వాలన్నారు. నిమజ్జన సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కమిటీ సభ్యులదే బాధ్యతన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి

బొబ్బిలి: వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు అన్నారు. స్థానిక పట్టణంలోని ఆరో వార్డు పరిధిలోని దేవాంగుల వీధి, చినబజారు ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావుతో కలిసి గురువారం పర్యటించిన ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టనున్న ప్రాంతాలను పరిశీలించి, సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి, నాణ్యతా ప్రమాణాల మేర నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. పాడైన విద్యుత్ స్తంభాలను మార్చాలన్నారు.

డీఈవో సమీక్ష

బొబ్బిలి: స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, డిప్యూటీ డీఈవోతో డీఈవో లింగేశ్వర రెడ్డి వర్చువల్ ద్వారా గురువారం సమావేశమై, మనబడి నాడు–నేడు పనులు, ల్యాబ్‌ల పనితీరు బైజూస్ కంటెంట్ అప్‌లోడ్, ప్రయోజనాలు, జగనన్న విద్యాకానుక పథకంపై సమీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో బ్రహ్మాజీరావు, ఎంఈవోలు సీహెచ్ లక్ష్మణరావు, జి.వాసు తదితరులు పాల్గొన్నారు.

సమైక్యతా వారధి 'హిందీ'



రామభద్రపురం: నాయుడువలస ప్రాథమికోన్నత పాఠశాలలో హిందీ 'అ' అక్షరం రూపంలో కూర్చున్న విద్యార్థులు



వంగర: అరసాడలో హిందీ 'అ' ఆకారంలో విద్యార్థులు



రాజాం సిటీ: కంచరాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ పదం ఆకారంలో విద్యార్థులు

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో హిందీ భాషా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, ముఖ్య వక్తలు హిందీ భాష ఆవశ్యకతను వివరించారు. దేశంలో జాతీయ సమైక్యతా భావం పెంపొందించేందుకు హిందీ భాష చాలా అవసరమని, ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య సమైక్యతా వారధిగా కూడా హిందీ ఎంతగానో దోహదపడుతోందని వక్తలు తెలిపారు. ప్రతిఒక్కరూ హిందీ నేర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు హిందీ పదం, హిందీ అక్షరాల రూపంలో ఏర్పడి, ఆకట్టుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్‌.



రాజాం: పెనుబాకలో క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు

భీమవరంలో 'పొలంబడి'

బాడంగి: మండలంలోని భీమవరం గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కె.శిరీష ఖరీఫ్ వరి సాగుకు సోకుతున్న పాముపొడ, ఎండుతెగులు నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలకు రైతులకు అవగాహన కల్పించారు.

సక్రమంగా పోలింగ్‌బూత్‌ల ఏర్పాటు

రాజాం సిటీ: రేషనలైజేషన్ ప్రకారం అన్ని గ్రామాల్లో పోలింగ్ బూత్‌ల ఏర్పాటు సక్రమంగా చేపడుతున్నామని ఈఆర్వో కె.పద్మలత తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజాం, వంగర బీఎల్‌వోలతో పాటు అన్ని పార్టీల నేతలతో సమావేశమైన ఆమె పోలింగ్ బూత్‌లలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులదేనన్నారు.

వారంలోగా పన్నులు చెల్లించండి

తెర్లాం: వారం రోజుల్లోపు గ్రామ పంచాయతీల్లో రెండేళ్లుగా బకాయి ఉన్న గ్రంథాలయ పన్నులను పంచాయతీ కార్యదర్శులు చెల్లించాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఆయన 2021–22, 2022–23 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి, గ్రంథాలయ పన్నుల బకాయి ఉందని, ఆ బకాయిలను సకాలంలో చెల్లించాలన్నారు. సచివాలయ ఉద్యోగులంతా తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరును నమోదు చేయాలని తెలిపారు.

స్వచ్ఛ గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం



బొబ్బిలి: చెత్త సేకరణ బుట్టలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో చెత్త సేకరణ బుట్టల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పలువురికి బుట్టలు అందజేసి, కాసేపు మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు గ్రీన్‌అంబాసిడర్లు నియమించడం జరిగిందని, వారు బండితో ఇంటింటికీ వచ్చినప్పుడు తడి, పొడి చెత్తను వేర్వేరుగా బుట్టలలో వేసి, వారికి అందించాలని తెలిపారు. ఇలా ప్రతిఒక్కరూ చేస్తే గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని, తద్వారా ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.లక్ష్మి, ఎంపీడీవో పి.రవికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, ఈవోపీఆర్డీ ఎ.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజాం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని అన్ని పంచాయతీలకు సంబంధించి, మంజూరైన చెత్త సేకరణ బుట్టలను ఎమ్మెల్యే కంబాల జోగులు చేతులమీదుగా గురువారం పంపిణీ చేశారు. వీటిల్లో తడి, పొడి చెత్తను వేసి, ఇంటి దగ్గరకు వచ్చే గ్రీన్‌అంబాసిడర్లకు అందజేసి, గ్రామ పారిశుద్ధ్యానికి తోడ్పడాలని ఎమ్మెల్యే కోరారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం..

రామభద్రపురం: ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పలు పంచాయతీలకు మంజూరు చేసిన చెత్త సేకరణ బుట్టలను పంచాయతీల ప్రతినిధులకు ఎంపీపీ గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రతీ పంచాయతీలోని ప్రజలకు ఈ చెత్త సేకరణ బుట్టలను అందించడం జరుగుతోందని, వీటిలో తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా వేసి, గ్రీన్‌అంబాసిడర్లకు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమామణి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్(ముఖ్యమంత్రి సహాయ నిధి) నిలుస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. రాజాం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రేగిడి మండలంలోని వండానపేట గ్రామానికి చెందిన ముగడ రాముయాదవ్‌కు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.30 వేల చెక్కును ఎమ్మెల్యే చేతులమీదుగా గురువారం అందజేశారు. గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన వైద్యఖర్చుల కోసం ఆర్థికసాయానికి దరఖాస్తు చేసుకోగా, నగదు మంజూరైందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని, ఓ వైపు ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తూనే మరోవైపు ఇలా ఆర్థికంగా సాయం చేస్తుండడం చాలా గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.చక్రపాణి, మాజీ సర్పంచ్ కిశోర్‌కుమార్, సంకిలి పీఏసీఎస్ అధ్యక్షుడు ఎల్. వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ వలంటీర్లతో సమావేశమైన ఆయన గ్రామ వలంటీర్లు వారికి కేటాయించిన 50 ఇళ్లకు వెళ్లి, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆ తర్వాత సీహెచ్‌వోలు, ఏఎన్‌ఎంలు ప్రతీ ఇంటికి వెళ్లి, ఎవరైనా అనారోగ్యంతో బాధపడితే వారి వివరాలు సేకరిస్తారన్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి సచివాలయాల్లో జరిగే వైద్య శిబిరాలకు వారిని తీసుకుని వెళ్లి, వైద్య పరీక్షలు చేయించి, మందులు అందజేస్తారని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు అనారోగ్య సమస్యలుంటే వారి వివరాలను ఏఎన్‌ఎంలు, సీహెచ్‌వోకు తెలియజేయాలన్నారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో ఐసీడీఎస్ బాడంగి పీవో కె.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

30న వైద్య శిబిరం..

బాడంగి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బాడంగి–2(పిన్నవలస) సచివాలయ సిబ్బంది, కార్యదర్శి, వైద్యారోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లతో ఎంపీడీవో ఆంజనేయులు గురువారం సమావేశమై, జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పక్కాగా చేపట్టాలని సూచించారు. 15 రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి, ఎవరైనా అనారోగ్యంతో బాధపడితే వారి వివరాలు సేకరించాలన్నారు. అనంతరం ఈ నెల 30వ తేదీన జరిగే వైద్య శిబిరానికి వారిని తీసుకువస్తే, వైద్య పరీక్షలతో పాటు మందులు అందజేయడం జరుగుతుందన్నారు.

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని గొల్లపల్లి, సాయినగర్, సంఘం వీధుల్లోని అర్బన్ హెల్త్ సెంటర్లలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఇదే విషయమై వైద్యాధికారులు, మున్సిపల్ అధికారులతో గురువారం సమావేశమైన ఆయన అనారోగ్యంతో బాధపడేవారికి వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు కూడా అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం పక్కి గ్రామంలో జరిగిన గ్రామ, మండల స్థాయి అధికారుల సమావేశంలో ఎంపీడీవో పి.రవికుమార్ పాల్గొని, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాం సిటీ: స్థానిక మొగిలివలస సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఏఈ ఫణీంద్రకుమార్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. శ్రీకాకుళం రోడ్డు, పాలకొండ రోడ్డు, డోలపేట, గురవాం, పొనుగుటివలస, ఇజ్జిపేట ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కలగనున్న ఈ అంతరాయనికి వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

పండగలా కొత్త పింఛన్ల పంపిణీ



బొబ్బిలి: నారాయణప్పవలసలో పింఛన్ అందుకున్న ఆనందంలో లబ్ధిదారులు

పండగలా కొత్త పింఛన్ల పంపిణీ గురువారం జరిగింది. ప్రజాప్రతినిధుల చేతులమీదుగా లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ వర్గానికి మేలు జరిగేలా సంక్షేమ పథకాలు రూపొందించి, అమలు చేస్తుండడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కొత్తగా పెన్షన్ పొందిన వారు కూడా జై జగన్ నినాదాలతో మరోసారి నువ్వే మాకు సీఎంగా కావాలని కోరుతుండడం విశేషం.

– సాక్షి నెట్‌వర్క్‌.



రాజాం: కొత్త వారికి పింఛన్ నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



సంతకవిటి: జావాంలో కొత్తగా పింఛన్లు పొందిన వారితో సర్పంచ్ ప్రసాద్ తదితరులు



బాడంగి: కోడూరులో పింఛన్ల పంపిణీలో సర్పంచ్ జ్యోతి, ఎంపీపీ సలహాదారు మధు



మెంటాడ: లబ్ధిదారుకు కొత్తగా మంజూరైన పింఛన్ నగదు అందజేస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు



రేగిడి: అంబాడలో కొత్త పింఛన్లు అందజేస్తున్న ఎంపీపీ అప్పలనరసమ్మ